ఎంవిఐ విజయ్‌భాస్కర్‌పై చర్యలకు మంత్రి ఆదేశం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఆర్‌టిఒ కార్యాలయంలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌గా (ఎంవిఐ) విధులు నిర్వహిస్తున్న విజయ్‌భాస్కర్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. అధికారిగా ఉండి అక్రమ వసూళ్లకు పాల్పడటం హేయనీయమన్నారు. అధికారిని ప్రశ్నించడం పట్ల డ్రైవర్ల ఆవేదన అర్థమవుతుందని పేర్కొన్నారు. విజయ భాస్కర్ రాజు డ్రైవర్ల వద్ద వసూళ్లకు పాల్పడుతూ ఉన్న వీడియో వైరల్ కావడం పట్ల ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జరిగిన ఘటనపై మంత్రి ఆరా తీశారు. తదుపరి చర్యల నిమిత్తం నియమాల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రవాణా అధికార్లు యూనిఫామ్ లేకుండా రోడ్లు పై కనబడితే కఠిన చర్యలు తప్పవని మంత్రి వెల్లడించారు. రవాణా అధికారులు శాఖకు కీర్తి తెచ్చేలా విధులు నిర్వహించాలని అధికారులకు మంత్రి సూచన చేశారు.

బ్రహ్మసాగర్ లీకేజీ పనుల్లో కదలికేదీ?

నిపుణుల కమిటీ పరిశీలనకే ఏడాది!
జియోఫెన్సింగ్, సీస్మిక్ పరీక్షకు కసరత్తు
రూ.52 కోట్ల పనులకు మెఘా ఎంపిక



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

బ్రహ్మసాగర్ రిజర్వాయర్ లీకేజీ మరమ్మతు పనుల కదలిక ఎప్పుడో తెలియడం లేదు. గతంలో మెఘా ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ సంస్థ రూ.52 కోట్లతో లీకేజీ నియంత్రణ పనులు చేపట్టింది. 100 మీటర్ల పరిధిలోని ఆనకట్ట లీకేజీ పనులను పోలవరం పనుల తరహాలో సిమెంట్ గ్రౌటింగ్ పనులు చేపట్టాల్సి ఉందని నిర్ధారించింది. మట్టికట్టలోని నిర్దేశిత ప్రాంతంలో సిమెంట్ గ్రౌటింగ్ ద్వారా లీకేజీని అరికట్టాలని నిర్ణయించింది. ఆనకట్టలోనికి 36 ప్యానళ్లను చొప్పించింది. ఇక్కడ నుంచి ప్యానళ్ల మధ్య అత్యాధునిక టెక్నాలజీతో కూడిన గ్రౌటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. 36 ప్యానళ్ల మధ్య చేపట్టాల్సిన సిమెంట్ గ్రౌటింగ్ పనుల వ్యవహారాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లింది. ప్రభుత్వ ఆమోదం లభించిన అనంతరం రాష్ట్రంలోని సాగునీటి పారుదల శాఖ నిపుణుల సలహాలు, సూచనల సహాయంతో గ్రౌటింగ్ పనులను చేపట్టాలని నిర్ణయించింది. మట్టికట్టలోని 200వ మీటరులో పలు చోట్ల నీటిచెమ్మ వెలువడుతున్నట్లు గుర్తించింది. జాతీయ స్థాయి నీటిపారుదల సంస్థ సిడబ్ల్యుసి, జాతీయ ఇరిగేషన్ ఇంజినీరింగ్ నిపుణుల బృందం జియోఫిజికల్, సీస్మిక్ పరీక్షల ఆధారంగా పనులు చేపట్టాలని సూచించింది. నాలుగేళ్ల కిందట అన్నమయ్య రిజర్వాయర్ మట్టికట్ట తెగిన కారణంగా 32 గ్రామాల పరిధిలోని ఆరు గ్రామాలు ముంపునకుగురై 39 మంది గల్లంతైన సంగతి తెలిసిందే. ఇటువంటి అనుభవాల నేపథ్యంలో బ్రహ్మసాగర్ రిజర్వాయర్ లీకేజీ వ్యవహారంపై నీటిపారుదలశాఖ సీరియస్‌గా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయి నిపుణుల బృందం సహాయంతో మట్టికట్టలోని ఎక్కడ నుంచి లీకేజీ అవుతోంది, ఎటువంటి నివారణ పద్ధతులు పాటించాలి, లీకేజీ గుర్తింపునకు అనుసరించాల్సిన పరీక్షలపై అంశాలపై మేధోమథనం సాగిస్తోంది. జియోఫెన్సింగ్, సీస్మిక్ పరీక్షల ద్వారా మట్టికట్ట లీకేజీని గుర్తించనుంది. జాతీయ స్థాయి ఇంజినీరింగ్ నిపుణుల బృందం సూచనలు, సలహాల ఆధారంగా లీకేజీ నివారణ పనులు చేపట్టడంపై దృష్టి సారించింది. మిగిలిన రూ.42 కోట్ల పనులకు రెండు దఫాలుగా టెండర్లు నిర్వహించింది. కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకురాని పరిస్థితుల నేపథ్యంలో ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీనిపై సంబంధిత తెలుగుగంగ సూపరింటెండెంట్ ఇంజినీర్‌ను సంప్రదించగా జాతీయ స్థాయి ఇంజినీరింగ్ నిపుణుల సలహా ప్రకారం పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొనడం గమనార్హం.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు

- నష్టపోయిన రైతులకు మేలు చేయాలి
ప్రజాదర్బార్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తానని, మనకు అన్యాయం జరిగితే న్యాయపరంగా ముందుకు వెళ్దామని, ఎవరు అధైర్య పడకుండా ముందుకు వెళ్లాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం రెండో రోజు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రజల, వైసిపి శ్రేణుల సమస్యలను ఓపిగ్గా వింటూ, చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరిస్తూ తోడుగా నేనుంటానని వారికి భరోసా ఇచ్చారు. అధైర్య పడకుండా ఉండాలని, అందరికీ తోడుగా తానుంటానని, రైతన్నలకు మేలు చేయకపోతే పోరాటం చేస్తామని, అభిప్రాయ బేధాలు ఉంటే నాతో చెప్పాలని పేర్కొన్నారు. ఉల్లి రైతులు జగన్ కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. పది రోజుల క్రితం కురిసిన వర్షాలకి ఉల్లి పంట దెబ్బతినిందని దీనివల్ల తీవ్ర నష్టం జరిగిందని నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించాలని కూటమి ప్రభుత్వం అడుగులు వేయలేదని రైతులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జగన్ స్పందిస్తూ రైతులకు న్యాయం జరగకపోతే పోరాటం చేసే దానికి సిద్ధంగా ఉన్నామని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఏదైనా భేదాభిప్రాయాలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. అంతర్గత వైశ్యమ్యాల వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. ఎప్పుడైనా మీ సమస్యలు నాకు చెప్పుకోవచ్చని ఎప్పటికీ అందుబాటులో ఉంటానని నాయకులకు స్పష్టత ఇచ్చారు.

సమస్యలు వింటున్న వైఎస్ జగన్

జిల్లా రాజకీయాలపై చర్చ

జిల్లాలోని వైసిపి ముఖ్య నేతలతో మరోమారు రాజకీయ విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా బద్వేలు, జమ్మలమడుగు నియోజవర్గాలలో ఉన్న సమస్యలను మళ్లీ పునరావతం కాకుండా చూసుకోవాలని పార్టీ నేతలకు సూచించారు. కలిసికట్టుగా ఉండకపోతే పార్టీతో పాటు మీకు కూడా నష్టం జరుగుతుందని గట్టిగా ఆ నాయకులను మందలించారు. సమస్య ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి లేకపోతే నాయకుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఇలాంటి సమస్య మళ్లీ రాకుండా చూసుకోవాలన్నారు. నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు రాకుండా చూసుకోవాలని జిల్లా నాయకులను ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కును రక్షించుకుందాం'

ప్రజాశక్తి - కడప అర్బన్

విశాఖ ఉక్కు రక్షణకై - కడప ఉక్కు ఏర్పాటుకై నవంబర్ 1న విశాఖపట్నంలో నిర్వహించే విద్యార్థుల సదస్సును విజయంతం చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాము, రామన్న పిలుపునిచ్చారు. బుధవారం యుటిఎఫ్ భవన్‌లో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విశాఖ ఉక్కు పరిరక్షించుకోవడం కోసం 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు'అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా విద్యార్థి, యువజన సంఘాలు పోరాటం చేస్తూ ఉన్నాయని తెలిపారు, కానీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కును ప్రవేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతున్నాయని వాపోయారు. దాదాపు 1300 పైగా రోజుల పాటు ప్రయివేట్ పరం ఆపాలని ఉద్యమాలు చేస్తున్నా ఇంతవరకు పట్టించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కడప ఉక్కు కోసం మూడు ప్రభుత్వాలు, ముగ్గురు ముఖ్య మంత్రులు వచ్చి శంకుస్థాపన చేశారు, కానీ ఇంతవరకు పరిశ్రమ గురించి పట్టించుకోనిపాపాన పోలేదని తెలిపారు. కడప జిల్లాలో వేలాది మంది నిరుద్యోగులు ఉన్నారని, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం ద్వారా కొన్ని వేల మందికి ఉద్యోగ అవకాశం లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, రవి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని శివకుమార్, రాష్ట్ర నాయకులు జగదీష్, అదిల్, అంజనేయరాజ్, జిల్లా నాయకులు డేవిడ్ రాజ్, అంజి, విజయ్, ఉదయ్ పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- 4 దుంగలు, వన్యప్రాణి అలుగు స్వాధీనం

ప్రజాశక్తి - కడప అర్బన్

బద్వేల్ రేంజ్ ఫారెస్ట్ అధికారులు బద్వేల్ రేంజ్, బ్రాహ్మణపల్లి బీట్‌లో ఎర్ర చందనం దుంగలను స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారని జిల్లా అటవీ అధికారి వినీత్ కుమార్ తెలిపారు. బుధవారం అటవీ శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు నిందితుల నుంచి 4 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బద్వేల్ రేంజ్ బోయనపల్లి బీటు పరిధిలో ప్రాణాలతో ఉన్న అత్యంత అరుదైన అలుగును విక్రయించడానికి ప్రయత్నిస్తూ మరో ఐదుగురు వ్యక్తులు బద్వేల్ ఫారెస్ట్ అధికారులకు పట్టుబడ్డారని పేర్కొన్నారు. కేసులో ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఎర్ర చందనం స్మగ్లింగ్ చేయడం చట్ట రీత్యా నేరమని, ఎటువంటి హాని చేయని అలుగు అంతరించి పోయే ప్రాణుల జాబితాలో ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాణిని విక్రయించడం, హాని కలిగించడం తీవ్రమైన నేరమని తెలిపారు. సమావేశంలో సబ్ డివిజన్ డిఎఫ్ఒ స్వామి వివేకానంద, ఇన్‌ఛార్జి ఎఫ్ఆర్ఒ కె. వెంకట శేషయ్య, ఎఫ్ఎస్ఒ ఎన్. ఎస్. ఖాజావల్లి, ఎఫ్ఒఎం. పుష్పరాజ్, సి. విజయలక్ష్మి, ఎం. సువర్ణ కుమార్, పి. రాజేష్ రెడ్డి, ఎల్. లక్ష్మీ నరసమ్మ, ఎబిఒ ఎస్. డి. మున్నాఫ్, ఎస్. అక్బర్ షరీఫ్, ప్రొటెక్షన్ వాచర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడ్డ నిందితులు, స్వాధీనం చేసుకున్న అలుగు

ఉరుసు ఏర్పాట్లు ముమ్మరం చేయాలి

- ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : నవంబర్ 3 నుంచి 21 వరకు కన్నుల పండుగగా నిర్వహించబోయే అమీన్‌పీర్ దర్గా ఉరుసు మహోత్సవ ఏర్పాట్లను ముమ్మరం చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆ ర్ఎస్ హాల్‌లో అమీన్ పీర్ దర్గా ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఊరుసు ఉత్సవాల్లో భాగంగా 3న ఊరుసు ప్రారంభ సూచికగా దర్గా నుంచి నగరంలోని పలు ప్రధాన మార్గాల ద్వారా దాదాపు 500 మందితో ఊరేగింపుగా నిర్వహించి చివరగా పీఠాధిపతులు వారి గృహం వరకు వెళ్లి చేలా సమర్పణ చేస్తారని చెప్పారు. లక్షలాది మంది భక్తులు వస్తారని వారికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయాలని, ఎక్కడా ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా గట్టి భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్యం, రోడ్లు, విద్యుత్, మంచినీరు వసతులకు ఎలాంటి కొరత లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎస్‌పి హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ పోలీస్ శాఖ అన్ని కోణాలలో భద్రత ఏర్పాట్లు చేస్తుందని చెప్పారు. ఇప్పటికే పోలీసు శాఖ అన్ని రకాల భద్రత చర్యలను చేపట్టిందన్నారు. దర్గా కమిటీ సహకారంతో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, ఫైర్ అధికారి ధర్మారావు, ఆర్‌టిసి ఆర్ఎం గోపాల్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఇమ్రాన్, డిఐపిఆర్ఒ వేణుగోపాల్ రెడ్డి, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రాకేష్, వివిధ శాఖల అధికారులు, దర్గా మత పెద్దలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్-14 గ్రూప్ -బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ రెండో రోజు బుధవారం కొనసాగింది. వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో శ్రీకాకుళం, విజయనగరం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్ లో శ్రీకాకుళం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 336 పరుగులు చేసింది. చివరి రోజు మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు 70.5 ఓవర్లలో 165 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని బాబా తర్షిత్ 42, జస్టిన్ 29 పరుగులు చేశారు. శ్రీకాకుళం జట్టులోని సాత్విక్ నాలుగు, వివేక్ నంద రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు ఆట ముగిసే సమయానికి 19.0 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. ఆ జట్టులోని కృష్ణ కౌశల్ 37 పరుగులు చేశాడు. విజయనగరం జట్టులోని సాత్విక్ రెండు వికెట్లు తీసుకున్నాడు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో శ్రీకాకుళం జట్టు ఆధిక్యత సాధించింది.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు లాస్యశ్రీ ఎంపిక

ప్రజాశక్తి - కడప : జాతీయ స్కూల్ గేమ్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు కడప నగరానికి చెందిన మట్టం లాస్యశ్రీ ఎంపికయింది. ఈనెల 29, 30 తేదీలలో సత్యసాయి జిల్లా లేపాక్షిలో జరిగిన రాష్ట్ర స్కూల్ గేమ్ అండర్ -14 బాలికల ఛాంపియన్‌షిప్‌లో లాస్య శ్రీ ఐదవ స్థానం సాధించింది. ఆరు రౌండ్లకు 5 పాయింట్లు సాధించి జాతీయ స్కూల్ గేమ్స్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధించిందని అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి తెలిపారు. ఈనెల 28, 29 తేదీలలో బాపట్లలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ యు -17 టీమ్ చెస్ చాంపియన్ షిప్‌లో కడప జిల్లా బాలికల జట్టు రాష్ట్ర స్థాయిలో నాలుగవ స్థానం సాధించింది. సజోత్సన, తేజోమయి, చాతుర్య , జహన్వి లతో కూడిన ఈ జట్టు రాష్ట్రస్థాయిలో రాణించి నాలుగవ స్థానం సాధించడం హర్షణీయమని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అని దర్బారి తెలియజేశారు.

విద్యార్థిని అభినందిస్తున్న కార్యదర్శి

భగ్గుమన్న ఫ్యాక్షన్ గొడవలు

- పొలం విషయమై రెండు గ్రూపుల మధ్య ఘర్షణ
- వైసిపి, కూటమి నేతలు కత్తులతో పరస్పర దాడులు
- ఇరు గ్రూపులకు చెందిన 9 మందికి రక్తగాయాలు
-బాధితులను పరామర్శించిన ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే

ఘర్షణలో గాయపడిన వారిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నియోజకవర్గంలో ఫ్యాక్షన్ గొడవలు భగ్గుమన్నాయి. పొలం విషయంపై ఇరు పార్టీలకు చెందిన నాయకులు వాదోపవాదాలకు దిగి చివరకు కత్తులు, గొడ్డలితో దాడి చేసుకున్నారు. ఈ సంఘటన మండల పరిధిలోని పెద్ద దండ్లూరు గ్రామంలో చోటు చేసుకోవడంతో గ్రామంలోని ప్రజలు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. పొలం తగాదా విషయంపై వైసిపి నాయకులు, కూటమి నాయకులు ఘర్షణకు పాల్పడ్డారు. ఈ ఘర్షణలో దాదాపు 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల వివరాల మేరకు.. బుధవారం పెద్దండూరు గ్రామంలోని ఇరు గ్రూపులకు చెందినవారు పొలం విషయంలో ఘర్షణ పడ్డారు. ఇందులో కూటమి మద్దతుదారులైన నడిపి ఎల్లారెడ్డి, గురివిరెడ్డి రామాంజనీయ రెడ్డి, పెద్ద తిమ్మన్నతోపాటు వైసిపికి చెందిన హనుమంత రెడ్డి, గురివిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఎల్లారెడ్డి, సుధాకర్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో హనుమంత్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారికి సర్దిజెప్పి గాయపడిన వారిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మూలే సుధీర్‌రెడ్డి జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలోని బాధితులను పరామర్శించారు. అటు కూటమి నాయ కులు కూడా వారి తరపు బాధితులను పరా మర్శించారు. ఎమ్మెల్సీ గ్రూపునకు చెందిన హను మంతరెడ్డి, రామనాథరెడ్డి తీవ్రంగా గాయపడడంతో వారిని ప్రొద్దుటూరు ఆస్పత్రికి, మరికొందరిని మె రుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు వైద్యులు తరలించారు. ఘర్షణకు పాల్పడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీవ్రంగా గాయపడిన బాధితుడు

ఫ్యాక్షన్ నియోజకవర్గమైన జమ్మలమడుగులో పోలీసులు అప్రమత్తంగా లేకుంటే గొడవలు జరుగుతూనే ఉంటాయని మాజీ ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం తీవ్రంగా గాయపడిన హనుమంత రెడ్డిపై రెండు నెలల కిందట జమ్మలమడుగు కోర్టు ముందు దాడి జరిగిందని పేర్కొన్నారు. అప్పుడే నిందితులను కఠినంగా శిక్షించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

అన్న క్యాంటీన్ ఆహారం తయారీ కేంద్రంలో ప్రమాదం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని మార్కెట్ యార్డ్‌లో హరే కృష్ణ మూమెంట్స్ వారు అన్నా క్యాంటీన్‌కు అవసరమైన టిఫిన్, భోజనం, డిన్నర్ తయారు చేస్తూ ఉంటారు. బుధవారం ఉదయం స్టీమర్ ఆటో కట్ ఆఫ్ కావాల్సి ఉండగా సాంకేతిక లోపం వల్ల కాలేదు. దీంతో స్టీమర్ ఒక్కసారిగా పేలిపోయింది. మైనర్ సంఘటన కావడంతో ఎలాంటి ప్రాణ నష్టం చోటు చేసుకోలేదు. చిన్న ప్రమాదంతో బయటపడ్డారు. స్టీమర్‌ను మాన్యువల్‌గా తెరిచేందుకు ప్రయత్నించిన సఫలం కాలేదు. దీంతో స్టీమర్ పేలిపోయింది. అన్న క్యాంటీన్లకు టిఫిన్, భోజనం, డిన్నర్ సకాలంలో అందజేశారు. ఘటనపై హరే కృష్ణ మూమెంట్ ఒపిఎం విష్ణువర్ధన్ మాట్లాడుతూ స్టీమర్ ఆటోమేటిక్ కట్ ఆఫ్ కావాల్సి ఉండగా టెక్నికల్ సమస్య వల్ల కాలేదన్నారు. దీంతో స్టీమర్ దెబ్బతినిందని చెప్పారు. విషయం తెలియగానే కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి ఘటనా స్థలాన్నిపరిశీలించారు. సాంకేతిక లోపం వల్ల ఈ ఘటన చోటు చేసుకున్నట్లు అక్కడి సిబ్బంది వివరించారు. రాత్రి వేళ కావడంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగలేదన్నారు. ఈ తరహా నిర్లక్ష్యాన్ని నివారించేలా తగిన చర్యలు తీసుకోవాలని అక్కడి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ విజయభాస్కర్ గౌడ్, టిపిబివో రాధాకృష్ణ, అన్న క్యాంటీన్ ఎగ్జిక్యూటివ్ సూపర్వైజర్ చిన్న ఓబయ్య, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్ కొరియాలో పరిశోధనకు వైవీయూ ఆచార్యులు శంకర్

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయంమెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డా.ఎం.వి.శంకర్ సౌత్ కొరియా పరిశోధన నిమిత్తం బయలుదేరి వెళ్లారు. దక్షిణ కొరియా అంతర్జాతీయ స్థాయిలో 81 మంది పరిశోధకులను బ్రెయిన్ పూల్ ఫెలోలుగా ఎంపిక చేయగా అందులో ఆచార్య ఎం.వి శంకర్ ఒకరు. సూక్ష్మ పదార్థాలను ఉపయోగించి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పై పరిశోధనలు చేస్తారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్‌లో బ్రెయిన్ పూల్ ఫెలోగా పని చేస్తారు. పరిశోధనపై వెళుతున్న శంకర్‌ను వైవీయూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సి పల్ ఎస్.రఘునాథరెడ్డి, నానో టెక్నాలజీ సహ ఆచార్యులు డాక్టర్ మమత, పరిశోధకులు, విద్యార్థులు, మిత్రులు అభినందించారు. **ఎం.వి. శంకర్‌కు సన్మానం..** దక్షిణ కొరియా ఫౌండేషన్ 2024 సంవత్సరానికి అత్యుత్తమ విదేశీ పరిశోధనలకు వెళ్తున్న బ్రెయిన్ పూల్ ఫెలోషిప్, యోగి వేమన విశ్వ విద్యాలయం మెటీరియల్ సైన్స్ నానో టెక్నాలజీ ఆచార్యులు ఎం.వి.శంకర్‌ను వైవీయూ పాలకమండలి సభ్యులు మూల మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు.

ఎంవిఐపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప ఆర్‌టిఒ కార్యాలయంలో పనిచేస్తూ అవినీతికి పాల్పడుతున్న ఎంఇఐ విజయ్ భాస్కర్‌ను సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసులురెడ్డి, మనోహర్, జిల్లా కోశాధికారి బి.లక్ష్మి దేవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఈయన అవినితి పైన సిఐటియు ఆనేక రకాల పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. నగరంలో దాదాపు 68 మంది ఏజెంట్స్‌కు రహస్య కొడింగ్ ఇచ్చి పెట్టుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం వాటి సంఖ్య కుదించుకుని వసూలు చేస్తున్నారని తెలిపారు. చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

జిఎన్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్‌గా శ్రీనివాసులు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిఎన్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్ (ఎల్ఎ)గా జి. శ్రీనివాసులు బుధవారం బాధ్యతల స్వీకరించారు. కుప్పం ఆర్‌డిఒగా పనిచేస్తూ బదిలీపై కడపకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన కౌసర్ భాను తాడేపల్లికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో శ్రీనివాసులు కడపకు వచ్చారు.

విద్యా సంస్థల్లో దీపావళి సంబరాలు

ప్రజాశక్తి- కడప అర్బన్

గురుకుల్ విద్యాపీఠ్‌లో.. దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి విద్యార్థులు పూజలు చేశారు. టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ వీరా కుమారి, సిఇఒ ఎ.ఎల్ వివేకానంద, హెడ్మాస్టర్ మునిచంద్ర, వైస్ ప్రిన్సిపల్ నరసింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **సాయిబాబా విద్యాసంస్థల్లో..** నగరంలోని సాయిబాబా విద్యాసంస్థల్లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పండుగ చేసుకుంటారని పేర్కొన్నారు. పాఠశాల సిఇఒ ఎం. వి. శ్రీదేవి మాట్లాడుతూ దీపావళి అనే పదం సంస్కృతం నుంచి వచ్చిందని తెలిపారు. వైస్ చైర్మన్ ఎం.వి.సాయి సుధీర్ కుమార్ రెడ్డి వ దీపావళి శుభాకాంక్షలు విద్యార్థులకు తెలియజేశారు. టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాఠశాల ఆవరణంలో బాణాసంచా కాల్చారు. **ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో..** స్థానిక బాలాజీ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వీర సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాలుష్య రహిత దీపావళి నిర్వహించుకొని పర్యావరణ సంరక్షణలో ప్రముఖ పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ముగ్గుల, దియా మేకింగ్ పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని నిరూపిస్తూ విద్యార్థులందరూ కార్యక్రమంలో పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపల్ తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు అధిపతులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులతో కలిసి వేడుకలు నిర్వహిస్తున్న విద్యా సంస్థల వైఎస్‌చైర్మన్, సిఇఒ

ఎస్వి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల సంబరాలు

గురుకుల్ విద్యాపీఠ్‌లో దీపావళి పండుగపై అవగాహన కల్పిస్తున్న చైర్మన్

ట్రాఫిక్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్

వాహనం కలిగిన ప్రతి ఒక్కరూ హెల్మె ట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని ట్రాఫిక్ సిఐ జావీద్ యువతను కోరారు. బుధవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ట్రాఫిక్ సేవలు అనే అంశం పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర యువ అధికారి మణికంఠ మాట్లాడుతూ దివాలి విత్ మై భారత్ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ సేవల గురించి అవగాహన కల్గి ఉండాలని చెప్పారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నాగమ్మ మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని, అందరూ లైసెన్స్ కలిగి, వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ అశోక్, విజయ్, శ్రీకాంత్, యువత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ట్రాఫిక్ సిఐ జావీద్

వైద్య వృత్తి చాలా గొప్పది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కడపసిటీ

వైద్య వృత్తి చాలా గొప్పదని ఎమ్మెల్యే మాధవి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో ఎక్సిసియా ఫెస్ట్‌కు వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాక్షించారు. కాలంతో పరిగెత్తుతూ గమ్యస్థానానికి చేరుకోవడానికి పణాళిక బద్ధంగా సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ జవ్వాద్, ఇతర డైరెక్టర్లు, ప్రొఫెసర్లు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

ఇంటి రచ్చ పక్కదోవ పట్టించడానికే రైతులపై కపట ప్రేమ

- రైతుల అభిప్రాయం మేరకే కొత్త పంటల బీమా : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఇంటి రచ్చను పక్కదావ పట్టించడానికి మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులపై కపట ప్రేమ చూపుతున్నారని, రైతుల అభిప్రాయం మేరకే కొత్త పంటల బీమా విధానాన్ని అమలు చేస్తున్నామని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పంటల బీమా పథకాన్ని సర్వనాశనం చేసింది జగనేనని ఆరోపించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన నుంచి ఎందుకు బయటకు వచ్చారు, మళ్లీ ఎందుకు చేరారని వైఎస్ జగన్‌ను విమర్శించారు. రబీ పంటలకు బీమా పథకాన్ని ఎందుకు ఎత్తివేశారని అన్నారు. 2019లో రూ.333 కోట్ల బీమా సొమ్మును రైతులకు ఇవ్వకుండా ఎగ్గొట్టింది మీరు కాదా అని ప్రశ్నించారు. ఉచిత పంటల బీమాలో ఏ పంటకు బీమా కట్టారో తెలియని పరిస్థితిలో రైతులు మీ ప్రభుత్వంలో ఉన్నారని తెలిపారు. అలా కాకుండా రైతులు నచ్చిన పంటకు బీమా కొత్త విధానాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. మీ పాలన బాగుంటే రైతులు ఆత్మహత్యలు ఎందుకు చేసుకున్నారని ఎమ్మెల్సీ ప్రశ్నించారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న తహశీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపిడిఒ దివిజా సంపతి

ఎమ్మెల్యే 'పుట్టా'ను సన్మానించిన అధికారులు

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను ప్రొద్దుటూరులోని తన నివాసంలో బుధవారం మండల అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తహశీల్దార్ మహబూబ్ బాషా, ఎంపిడిఒ దివిజా సంపతి ఇతర అధికారులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మండలంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ, ఎమ్మెల్యే సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని అధికారులు తెలిపారు.

రేపు మైదుకూరులో జాబ్‌మేళా

ప్రజాశక్తి - చాపాడు

ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో నవంబర్ 1న మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి తెలిపారు. జాబ్‌మేళాకు డైకిన్ (ఏసీ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ), కీర్తన ఫిన్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్, టోరే ఇండస్ట్రీస్ వంటి ప్రముఖ మూడు కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, డిప్లొమా అభ్యర్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లు, బయోడేటా, ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉందన్నారు. మైదుకూరు, బద్వేల్ పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు ఎపిఎస్ఎస్ డిసి కో-ఆర్డినేటర్ జి.శివక్రిష్ణ 93983 48760ను సంప్రదించాలన్నారు.

గుంతలను పూడ్చుతున్న జెసిబి యంత్రం

రోడ్డు గుంతలను పూడ్చిన టిడిపి నేత

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పులివెందుల రోడ్డులో ఏరక్పడిన గుంతలను టిడిపి నేత వేమిరెడ్డి కృష్ణారెడ్డి పూడ్చారు. వర్షాలకు పులివెందుల రోడ్డులో ఎక్కువగా గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురికావడంతోపాటు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం వేంపల్లెకు చెందిన టిడిపి నేత వేమిరెడ్డి కృష్ణారెడ్డి తన సొంత డబ్బుతో జెసిబితో రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చారు. వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న సామాజిక పింఛన్లు పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపిడిఒ ముకుందరెడ్డి సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం సచివాలయం కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. పింఛన్లు ఉదయం 5 గంటల నుండి పంపిణీ చేయాలన్నారు. 19 గ్రామ పంచాయతీల్లో 5,246 పింఛన్లు ఉన్నాయన్నారు.

ఎంపిడిఒ సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో పనిచేసే బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్లిన ఎంపిడిఒ కార్యాలయ సిబ్బందిని బుధవారం ఎంపిపి లక్ష్మమయ్య అధ్యక్షతన సన్మానించారు. ఈ సందర్భంగా గతంలో ఎంపిడిఒగా పనిచేసి మైదుకూరు బదిలీపై వెళ్లిన శ్రీధర్ నాయుడును, జూనియర్ అసిస్టెంట్ మధు, టైపిస్టు, పంచాయతీ కార్యదర్శులు భాగ్యలక్ష్మి, ధనేశ్వర బాబు, సురేష్ ఇతర సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి టి.లక్ష్మమయ్య, ఎంపిడిఒ వీరకిషోర్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా చాపాడు మండలంలో పనిచేసి ప్రజలు, ప్రజాప్రతినిధులతో మన్ననలు పొందిన అధికారులు రాబోయే రోజుల్లో ఇతర ప్రాంతాల్లో కూడా పేరు ప్రఖ్యాతలు సంపాదించాలన్నారు. ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు సిబ్బందితో చాలా అన్యోన్యంగా వ్యవహరించి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపారని కొనియాడారు. కార్యక్రమంలో ఎఒ రామానుజం, ఈఓపీఆర్డీ రాధాకృష్ణ వేణి, వ్యవసాయాధికారి మ్యాగీ, ఎంఈఓ రవిశంకర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న సిబ్బందితో అధికారులు, ప్రజాప్రతినిధులు

మురికి కూపమా.. జీవాల మార్కెట్టా..!

వెదజల్లుతున్న దుర్వాసన - పట్టని అధికారులు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె నాలుగు రోడ్ల కూడలిలో జడ్‌పి గదుల వెనుక ఉన్న జీవాల మార్కెట్ అపరిశుభ్రంగా మారింది. ఆ ప్రాంతం మురికి కూపాన్ని తలపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. అక్కడి నుంచి వస్తున్న దుర్వాసన భరించలేకున్నామని పేర్కొన్నారు. జడ్‌పి వాణిజ్య గదుల వెనుక ఉన్న ఖాళీ స్థలంలో జీవాల మార్కెట్‌ను గతంలో పంచాయతీ అధికారులు ఏర్పాటు చేశారు. ఖాళీ స్థలం ఉన్న ప్రాంతంలో మందు బాబులు మద్యం సేవించి అక్కడే సీసాలను వేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న వారు చెత్త చెదారం వేయడంతో జీవాల మార్కెట్ అధ్వానంగా మారింది. జీవాల మార్కెట్ సమీపంలోనే విద్యుత్ బిల్లుల వసూలు కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 20 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. ప్రతి రోజూ విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు ఆ కార్యాలయం వద్దకు వెళుతుంటారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతం నుంచి దుర్వాసన వస్తుండడంతో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు వస్తున్న వినియోగదారులు చాలా అవస్థలు పడుతున్నారు. జడ్‌పికి చెందిన వాణిజ్య గదుల్లో వ్యాపారాలు చేసే దుకాణదారులు కూడా దుర్వాసనతో అల్లాడిపోతున్నారు. జీవాల మార్కెట్ ప్రాంతం అపరిశుభ్రతంగా ఉండడం వల్ల వ్యాపారం జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాల వద్దకు, కరెంటు బిల్లులు చెల్లించేందుకు వెళ్లాలంటే ముక్కు మూసుకొని పోవాల్సిన పరిస్థితి. మందు బాబులతోపాటు మరికొందరు ఆ ప్రాంతంలోనే మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అపరిశుభ్రతగా ఉన్న జీవాల మార్కెట్

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

రైతులకు సూచనలిస్తున్న ఎఒ శివమోహన్ రెడ్డి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధ్యమని ఎఒ శివ మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని రావులకొలను గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించి ప్రీమియం చెల్లింపు త్వరలోనే ప్రభుత్వం నిబంధనలను విడుదల చేయనుందన్నారు. సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు దీపిక, సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పొటాషియం వాడకం.. ప్రయోజనకరం

చాపాడు : మండల పరిధిలోని లక్ష్మీపేట, అల్లాడుపల్లె గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ కృష్ణమూర్తి, ఎఒ మ్యాగీ మాట్లాడుతూ వరి పంటలో యూరియా వాడకం తగ్గించి, పోటాషియం వాడాలన్నారు. వరి పొట్ట దశలో, వెన్న దశలో పొటాష్ చల్లడం వల్ల నాణ్యమైన విత్తనం ఏర్పడుతుందన్నారు. దోమ ఉధృతిని తగ్గించవచ్చని సూచించారు. వరిలో అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్, ఐసోప్రోథయోనిల్ 1.5 ఎంఎల్ చొప్పున లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. తెగుళ్ల నివారణకు హెక్సాకోనజోల్ మందు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో విఎఎలు గోపి రామ్, లత, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభసాటి

వేముల : మండలం కేంద్రంలోని నల్లచెరువుపల్లె రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం ఎఒ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఒ, యూనిట్ ఇన్‌ఛార్జి రామ్మోహన్ నాయుడు, వెంకటేష్, ఐసీఆర్‌పిలు, రైతులు, ఏపిసిఎన్ఎఫ్ సిబ్బంది, విఎఎ, విహెచ్ఎ, వెటర్నరీ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌ఛార్జి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించారు. ఎఒ చెన్నారెడ్డి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, ఐసీఆర్పిలు, రైతులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు

నిధులను వెంటనే విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఖాజీపేట

గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన నిధులను వెంటనే విడుదల చేసి, విద్యార్థులు సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆ మేరకు బుధవారం రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ రామయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యాదీవెన, వసతిదీవన నిధులు రూ.3,480 కోట్లు పెండింగ్‌లో ఉంచిందన్నారు. తద్వారా చదువులు పూర్తిచేసిన విద్యార్థులు సర్టిఫికేట్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారన్నారు. పలు యూనివర్శిటీలలో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో గత ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతి ఇస్తామని యాజామాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయన్నారు. నూతన ప్రభుత్వం కూడా బకాయిల విడుదల విషయంలో జాప్యం చేస్తోందన్నారు. కల్లబొల్లి మాటాలు చెబుతోందన్నారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలన్నారు. ఎన్నికల హామీలో భాగంగా తల్లికివందనం ప్రకటించారని, ఈ విద్యాసంవత్సరం అమలు చేస్తారో లేదో అనే గందరగోళం తల్లిదండ్రుల్లో నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తల్లికివందనం పథకం అమలుపై స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, సుజిత్, యశ్వంత్, సుధీర్ పాల్గొన్నారు.

మోడీ పాలనలో దేశం అప్పులపాలు

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

మోడీ పాలనలో దేశం అప్పుల భారత్‌గా మారిందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకినట్లుంది అప్పుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి అని విమర్శించారు. జగన్ పాలనలో ఆర్థిక క్రమశిక్షణ లోపించిందన్నారు. అందినకాడికి అప్పులు చేసి జగన్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని టిడిపి, జనసేన, బిజెపి విమర్శించాయన్నారు. ప్రస్తుతం అదే పని చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి 7 నెలల్లోనే రూ.59 వేల కోట్లు అప్పు చేసినట్లు చెప్పారు. ఇందులో రూ.51 వేల కోట్లు బడ్జెట్ ద్వారా ప్రత్యక్షంగా, రూ.8వేల కోట్లు ప్రభుత్వం గ్యారంటీ ద్వారా తీసుకుందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా రూ.5000 కోట్లు, పౌర సరఫరా సంస్థ ద్వారా రూ.2000 కోట్లు, ఏపీఐఐసీ ద్వారా రూ.1000 కోట్లు అప్పు తీసుకుందన్నారు. రాష్ట్రం 7 నెలలకే అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారిందని విమర్శించారు. ఇప్పటికైనా ఆర్థిక క్రమశిక్షణ పాటించి దేశాన్ని అప్పుల భారత్, రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్ చేయవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కాంగ్రెస్ పార్టీ సూచిస్తోందన్నారు.

వినతిపత్రం చదువుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

పిహెచ్‌సిలో మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వైఎంఆర్ కాలనీలోని పట్టణ ఆరోగ్య పిహెచ్‌సిలో మరమ్మతులు చేపట్టాలని వైద్యాధికారి నల్లబల్లి హిమబిందు కోరారు. ఆమేరకు బుధవారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కాంపౌండ్ లోపల ఫ్లోరింగ్ లేకపోవడం వల్ల రోగులు, తల్లులు, పిల్లలకు అసౌకర్యంగా ఉందన్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఈ సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కాకుమాని ఆనంద్, సిఎంఒ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అపార్ వివరాలు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులకు అపార్ కార్డు వివరాల నమోదుపై అన్ని ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల హెడ్ టీచర్లు, ప్రధానోపాధ్యాయులకు అపార్ ఐడి జనరేట్‌పై సమావేశం నిర్వహించారు. ఆధార్ కార్డులో విద్యార్థుల వివరాలు తప్పొప్పులు ఉంటే ఎలా నమోదు చేయాలి అనే విషయాలపై చర్చించారు.

మాట్లాడుతున్న డిఇఒ మీనాక్షి

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం వ్యాప్తంగా అన్ని ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ కార్డు జారీ చేయనున్నారని తెలిపారు. అపార్ కార్డు అంటే ఆటోమేటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ అంటారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అపార్ కార్డు పేరుతో వన్ నేషన్ వన్ ఐడి కార్డును అందుబాటులోకి తీసుకురానుందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఈ గుర్తింపు కార్డును ఇచ్చే ప్రక్రియను త్వరితగతన ప్రారంభించాలని అన్ని రాష్ట్రాలకు కేంద్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్, అన్ని ప్రయివేట్ స్కూల్ కరస్పాండెంట్లు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, హెడ్ టీచర్లు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

నగరదీపికలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానిక గాంధీ పార్కులో విధులు నిర్విహిస్తున్న నగర దీపికలకు బుధవారం దీపావళిని పురస్కరించుకొని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున చీరలు, బ్యాగులు పంపిణీ చేశారు. సద్భావన సేవా సమితి,మన ప్రజాసేవా సమితి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అంతకుముందు వసంతపేట, రామేశ్వరం ప్రాంతాలలో కమిషనర్ పర్యటించారు. ఇంటింటి చెత్తసేకరణ, కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ తమ ప్రాంతంలో వీధి దీపాల సమస్య ఉందన్నారు. ఇందుకు స్పందించిన కమిషనర్ సమస్యలను పరిష్కరించారు. ఆయా కార్యక్రమాలలో సమితి సభ్యులు, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, ఎలెక్ట్రీషియన్ పాల్గొన్నారు.

సరసమైన ధరలకే అమ్మాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

దీపావళి సందర్భంగా టపాసులను సరసమైన ధరలకు అమ్మాలని ఆర్‌డిఒ భానుశ్రీ ప్రత్యూష సూచించారు. పట్టణంలోని లయోలా డిగ్రీ కాలేజి సమీపంలో ఏర్పాటు చేసిన పటాకుల దుకాణాలను బుధవారం ఆర్‌డిఒ, తహశీల్దార్ నజీర్ అహ్మద్, ఎస్ఎఫ్ వెంకటసుబ్బయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నియమాలు ఖచ్చితంగా పాటించాలని దుకాణదారులకు సూచించారు. నీళ్ల ట్యాంకరు, నీళ్ల డ్రమ్ములు, ఇసుక బకెట్లు, కచ్చితంగా ఉండాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందజేయాలన్నారు.రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక పొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో టూ టౌన్ సిఐ యుగంధర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విధులు నిర్వహణలో భాగంగా అమరులైన రక్షకభటులను స్మరించుకొని రక్తదానం ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో ప్రజలకు తమ పోలీసు వ్యవస్థ ఎవరికి రక్తం అవసరమైనా అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం దేవిడ్‌రాజ్, భగత్ సింగ్ బ్లడ్ డొనేట్ గ్రూప్ కార్యదర్శి ఓబులేసు, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్, డాక్టర్స్ గోపాల్, దిలీప్, రోజి నెల్సన్, ప్రసాద్, పుల్లయ్య పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు దీపావళి

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి ఘనంగా నిర్వహించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో బుధవారం రంగు రంగుల డ్రస్‌లతో చిన్నారులు పలు కార్యక్రమాలు చేపట్టారు. దీపావళి పండగ అంటే చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం విజయం సాధించడమేనని చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. వెలుగులు పంచే పండుగ దీపావళి అన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా టపాకాయలు కాల్చే సమయంలో పెద్దలు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న వైసిపి నాయకుడు వేణుగోపాల్

వృద్ధులకు 'రాచినేని' అభిమానులు అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మేజర్ పంచాయతీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పుట్టినరోజు వేడుకలను బుధవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. వేంపల్లె వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. పాత గండి రోడ్డులోని మదర్‌థెరిస్సా వృద్ధాశ్రమంలో, రాజీవ్ నగర్ కాలనీలోని వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. బలిజ సంఘం ఆధ్వర్యంలో గౌరీదేవి ఆలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ వేంపల్లె పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పుట్టినరోజు వేడుకలను నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు రాచినేని వేణుగోపాల్, ఆది నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, బ్రహ్మ, నగేష్, ప్రసాద్‌రెడ్డి, సునీల్ కుమార్‌తోపాటు వైసిపి నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అతిథి భోజనం

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం పూర్వ విద్యార్థి వెంకట నాయుడు విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. ఆయన 1986లో ఇక్కడ విద్యానభ్యసించారు. ప్రస్తుతం ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి వెంకట నాయుడు విద్యార్థులకు నాణ్యమైన అతిథి భోజనం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని ప్రధానోపాధ్యాయులు రాజబాబు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న వెంకట నాయుడు

క్రైం కార్నర్

అరెస్టయిన నిందితులతో సిఐ మోహన్, పోలీసులు

చోరీ నిందితులు అరెస్టు

- రెండు ద్విచక్ర వాహనాలు, రూ.98 వేల విలువైన వైర్ స్వాధీనం

ప్రజాశక్తి - ఖాజీపేట

వ్యవసాయ మోటార్ల వైర్ల చోరీకి పాల్పడుతున్న నిందితులను బుధవారం ఖాజీపేట పోలీసుల అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ మోహన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మండలంలో కొన్ని నెలలుగా వ్యవసాయ మోటర్లకు సంబంధించి వైరు ఎక్కువగా చోరీకి గురైందన్నారు. మైదుకూరు మండలం అన్నలూరు గ్రామానికి చెందిన పిల్ల రామిగండ్ల సుబ్బరాయుడు, కొండాల రామాంజనేయులు, పిల్ల రామిగాండ్లవెంకటసుబ్బయ్య చెడు వ్యసనాలకు బానిసై, మద్యం కోసం, డబ్బు సంపాదించాలనే అత్యాశతో చోరీలకు పాల్పడుతుండే వారన్నారు. తుడుమలదిన్నె, అప్పనపల్లె గ్రామ సమీప పొలాల్లో వ్యవసాయ మోటర్లకు సంబంధించి 478 మీటర్ల వైరు చోరీ చేశారన్నారు. స్థానిక బిసి కాలనీకి చెందిన నిందితుడు మౌలాలికి చోరీ చేసిన వైరును అమ్ముతుండే వారన్నారు. ఇతని వద్ద నుంచి 280 మీటర్ల వైరు స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తం 758 కిలోల వైరుగా తెలిపారు. దీని విలువ సుమారు రూ.98 వేలు ఉంటుందన్నారు. దీనితోపాటు రెండు పల్సర్ ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. బుధవారం అందిన సమాచారం మేరకు కడప-కర్నూలు జాతీయ రహదారిపై బుడ్డాయిపల్లె సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మైదుకూరు నుంచి ఖాజీపేట వైపు వస్తున్న నిందితులు తమను చూసి పారిపోతుండగా వారిని వెంబడించి పట్టుకున్నామన్నారు. వారిని విచారించగా చోరీలు చేసినట్లు అంగీకరించారని సిఐ తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన సిఐ మోహన్, సిబ్బంది శ్రీనివాసులు, చిన్న సుబ్బయ్యను, సిబ్బందిని అభినందించారు.

పోలీసుల అదుపులో ఇసుక ట్రాక్టర్లు

ప్రజాశక్తి - కమలాపురం టౌన్

కమలాపురం పాపాగ్ని నది వంతెన వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను బుధవారం సిఐ రోషన్, ఎస్ఐ ప్రతాపరెడ్డి అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్‌లను స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన ట్రాక్టర్లు ఖాజీపేట మండలానికి చెందినవిగా తెలిపారు.

ఫ్యాప్టో చట్టం కింద కేసు నమోదు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నియోజక వర్గంలోని పెద్దమడియం మండలం నెమలిదిన్నె గ్రామంలో మంగళవారం మద్యం మత్తులో కన్న కూతురిపై తండ్రి అత్యాచారానికి పాల్పడ్డ సంఘటనలో పగడాల ఓబులేస్‌పై ఫ్యాప్టో కేసు నమోదు చేసి ఎస్ఐ సుబ్బారావు రిమాండ్‌కు తరలించారు. బుధవారం మధ్యాహ్నం జమ్మలమడుగు ఇన్‌ఛార్జి డిఎస్‌పి రమాకాంత్‌ను హ్యూమన్ రైట్స్ వారు వివరణ కోరగా.. బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై ఫ్యాప్టో కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు. ఇలాంటి అఘాయిత్యాలకు మరెవరు పాల్పడకుండా నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ తరపున న్యాయవాది రామ్మోహన్, అన్నెపురెడ్డి రాణి మాట్లాడుతూ బాలికకు అండగా ఉంటామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అనంతరం వారు నెమలదిన్నె వెళ్లి బాధితురాలు, ఆమె తల్లి, బంధువులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

ఇన్‌ఛార్జి డిఎస్‌పి రమాకాంత్‌తో మాట్లాడుతున్న హ్యూమన్ రైట్స్ నేతలు